సాక్షి కృష్ణాజిల్లా

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన ఘాట్‌రోడ్డులో రిటైనింగ్ వాల్ పనులను వేగవంతం చేయాలని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ▶8లో



వేలం పాట వాయిదా

వేదాద్రి(జగ్గయ్యపేట): వేదాద్రిలోని లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఈ నెల 11న నిర్వహించనున్న పలు బహిరంగ వేలం పాటలు వాయిదా పడినట్లు ఈవో తెలిపారు.



కేంద్ర వైద్య బృందం పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వరద బాధిత ప్రాంతాల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకు చెందిన నిపుణుల బృందం మంగళవారం పర్యటించింది.

న్యూస్‌రీల్

13, 14 తేదీల్లో బయ్యర్-సెల్లర్ మీట్

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ ఎంజీ రోడ్డులోని శ్రీ శేష సాయి కల్యాణ వేదికలో బయ్యర్-సెల్లర్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్.రఘునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో అన్ని జిల్లాల నుంచి చేనేత, పట్టు సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. జిల్లాలోని వస్త్ర వ్యాపారులు, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పరిసర గ్రామాల వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం పలు విధాలుగా భరోసా కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఇందులో భాగంగా వరద కారణంగా పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు మరమ్మతులు చేయించుకునే విషయంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లలో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులు చేపట్టేందుకు ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ కంపెనీలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఆయా ఎలక్ట్రానిక్ పరికరాల విడిభాగాలను రాయితీపై అందించాలని ముఖ్యమంత్రి కోరినట్లు వివరించారు. అందుకు కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్లు ఏర్పాటు చేసి సేవలందిస్తామని తెలిపినట్లు వివరించారు. ఎలక్ట్రానిక్ పరికరాల కంపెనీలు అవసరం మేరకు ఉదారంగా సేవలు అందించడం వల్ల బాధిత ప్రజలపై ఆర్థికంగా ఒత్తిడి తగ్గుతుందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక సేవా కేంద్రాలను, సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేసి ఈ విపత్కర పరిస్థితిలో బాధితులకు అండగా నిలవాలని కోరుతున్నట్లు కలెక్టర్ సృజన పిలుపునిచ్చారు.

విజయవాడ నగరంలో శాంతియజ్ఞం

దేవదాయశాఖ మంత్రి ఆనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కృష్ణానదికి వరదలు, బుడమేరు ముంపు నేపథ్యంలో ప్రజలందరికీ ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇవ్వాలని అమ్మవారిని కోరుతూ విజయవాడ నగరంలో శాంతి యజ్ఞం నిర్వహించనున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఇంద్రకీలాద్రికి వచ్చిన మంత్రి ఆనం ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు, ఉపద్రవాలన్నీ తొలగిపోవాలంటే కొన్ని పూజలు, హోమాలను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ ఏ తప్పు జరిగినా దైవాన్ని ప్రార్థిస్తామని, దీనికోసం శాంతియజ్ఞం తలపెట్టామని చెప్పారు.

ప్రయాగ్‌రాజ్-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రయాగ్‌రాజ్-బెంగళూరు మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 13 నుంచి అక్టోబర్ 17 వరకు ప్రతి ఆదివారం ప్రయాగ్‌రాజ్-బెంగళూరు ప్రత్యేక రైలు (04131) నడుస్తుంది. అదే విధంగా ఈ నెల 16 నుంచి అక్టోబర్ 20 వరకు ప్రతి బుధవారం బెంగళూరు-ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక రైలు(04132)నడుస్తుంది.

సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్స్)కు సంబంధించి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లలో 2024-25వ సంవత్సరానికి ప్రవేశం కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరా సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను అపరాధ రుసుము లేకుండా సెప్టెంబరు 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబరు 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 8008403506 ను సంప్రదించాలన్నారు.

నష్టం లెక్క చిక్కేనా..!

- పంట నష్టం నమోదు పక్కాగా వచ్చేనా?
- ఒక పొలం గట్టు నుంచి చూసి రాసుకొని వెళ్తున్న సిబ్బంది
- మిగిలిన పంటలు చూడాలని కోరితే.. అంతా ఒకటే కదా అంటున్న ఉద్యోగులు
- ఒక్కో రైతు పంట ఒక్కో దశలో.. ఒక్కొక్కరి నష్టాల్లోనూ తేడాలు
- జిల్లాలో 1.41 లక్షల హెక్టార్లలో సాగు
- మొత్తం 41 వేల హెక్టార్లలో ముంపునకు గురైన పంటలు

ఇటీవల అవనిగడ్డ మండలంలో వరద కారణంగా ముంపునకు గురైన పంటలను పరిశీలించి, నష్టం నమోదు కోసం వెళ్లిన బృందం.. ఓ పొలం గట్టు వద్ద కూర్చుని రాసుకుని వచ్చేసింది. తమ పొలాల్లోని పంట ముంపునకు గురయిందని, వాటిని వచ్చి చూడాలని పలువురు రైతులు కోరగా.. 'వరద వల్ల మునిగితే అన్ని చేలు మునిగే ఉంటాయి. మేము రాసుకుంటాం లేండి అని చెప్పి ఉద్యోగులు వెళ్లిపోయారు. తమ పొలాల్లోని పంటలు చూడలేదు.. వాటి గురించి తెలుసుకోలేదు.. తాము ఖర్చు చేసిన వ్యయం గురించి అడగలేదు.. తమ ఎదుట రికార్డులో నమోదు చేయలేదు. నష్టం ఏ మేరకు జరిగినట్లు జాబితాలో రాసుకుంటారో ఏమో.. అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

సాక్షి, మచిలీపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు జిల్లా రైతులను అతలాకుతలం చేశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అన్నదాతలు తమ పొలాలను సిద్ధం చేసుకుని, నారు, కలుపు, నాట్లు, సేద్యం, కూలీల కోసం వేలకు వేలు ఖర్చు చేసుకున్నారు. తమ వద్ద డబ్బు లేకపోతే అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. అయితే ప్రకృతి విలయతాండవంతో వేల హెక్టార్ల పంట ముంపునకు గురైంది. రోజుల తరబడి పంట నీటిలోనే ఉండిపోయింది. వారం రోజుల తరువాత తేరుకుంటున్న సమయంలో కృష్ణమ్మ మరోసారి వరద రూపంలో వచ్చి లోతట్టు పంట పొలాలను ముంచేసింది. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదిక పంపించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. పంట పొలాలకు వెళ్లి వాటిని పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేయాల్సి ఉండగా.. సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



ఘంటసాల మండలం యండకుదురు గ్రామంలో ముంపునకు గురైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

రూ.1.50లక్షలు అప్పులు చేశా



నేను పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేశాను. దీని కోసం రూ.2.30 లక్షలు పెట్టుబడి పెట్టాను. అందులో రూ.1.50 లక్షలు అప్పులు చేశాను. కానీ వరద వచ్చి పంటను మొత్తం ముంచేసింది. మాకు ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకునేందుకు పక్కాగా సర్వే చేసి, జరిగిన నష్టాన్ని సరిగ్గా అంచనా వేయాలి. నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసి ఆసరాగా నిలవాలి.

– గాంధీ, కౌలు రైతు, గుడివాడ

పంట నష్టం నమోదు ఇలా చేయాలి...

వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు పలు శాఖలు రంగంలోకి దిగాయి. వ్యవసాయ, రెవెన్యూ, పట్టు, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది ఈ పనిలో ఉన్నారు. అయితే పంట నష్టం అంచనా వేయాలంటే సాగైన పంటల వివరాలతో రైతు పొలానికి వెళ్లి, ముంపునకు గురైన పంటను పరిశీలించాలి. రైతులతో మాట్లాడాలి. నారు, నాటు, పంట రోజులు సేకరించాలి. పెట్టుబడులు, ఖర్చుల వివరాలు తెలుసుకోవాలి. అప్పుడే నష్టం అంచనా సాధ్యపడుతుంది.

తూతూ మంత్రంగా సర్వే

పంట నష్టాన్ని అంచనా వేసేందుకు క్షేత్ర స్థాయికి వెళ్లిన ప్రభుత్వ సిబ్బందిలో కొందరు పూర్తి స్థాయి పరిశీలన చేయడం లేదని తెలుస్తోంది. గ్రామంలోని ఓ ఏరియా పొలం గట్టుకు వెళ్లి, అక్కడి నుంచి ఆ ప్రాంతంలో సాగైన పొలాల వివరాలు తీసుకుని, వెనుదిరిగి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. తమ పొలాలను కూడా పరిశీలించాలని రైతులు కోరగా.. అంతా ఒకటే కదా.. ఒక పొలం మునిగితే అన్నీ మునిగి ఉంటాయి. ఒకరికి నష్టం జరిగినట్లే అందరికీ జరిగి ఉంటుంది కదా..అని కొందరు సిబ్బంది చెప్పి వెళ్లిపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేస్తే పంట నష్టం అంచనా పక్కాగా ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. కృష్ణాజిల్లాలో 41,542 హెక్టార్ల వరి, వేరుశనగ, చెరకు, మినుములు, పసుపు, కంద ఇతర పంటలు ముంపునకు గురి కాగా 4,039 హెక్టార్ల ఉద్యాన పంట, 56 హెక్టార్ల పట్టు పంట మునిగిపోయింది. సుమారు 40 వేల మంది రైతులు బాధితులుగా మారారు. పంట నష్ట పరిశీలన 70 శాతం పరిశీలన పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.



మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో ఒంద్రుతో మునిగిపోయిన అరటితోట



పుట్టగుంట వద్ద బస్సులో నుంచి బుడమేరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు



కంకిపాడు మండలం మద్దూరులో వరద ముంపునకు గురై కుళ్లిపోతున్న కంద పంట



కంకిపాడు మండలం కాసరనేనివారిపాలెంలో దెబ్బతిన్న అరటితోట

కేంద్ర బృందానికి వరద నష్టం నివేదిక అందజేస్తాం



చోడవరంలో వరదకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: జిల్లాలో వరదల కారణంగా జరిగిన నష్టం వివరాలపై కేంద్ర బృందానికి నివేదిక ఇస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల పరిధిలో కృష్ణానది వరదలకు దెబ్బతిన్న గృహాలను, చోడవరంలో ముంపునకు గురై నష్టం జరిగిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించటానికి కేంద్రబృందం బుధవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తుందని చెప్పారు. కేంద్ర బృందానికి నివేదిక ఇవ్వటానికి ముందుగా తాము వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి గృహాల బాధితులు, రైతులతో మాట్లాడామన్నారు. ముంపునకు గురై దెబ్బతిన్న గృహాలను, పంటలను పరిశీలించామని తెలిపారు. కృష్ణానది వరదల కారణంగా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గృహాలు చాలా దెబ్బతిన్నాయని, పంటలు కూడా ముంపునకు గురై రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చినట్లు గుర్తించామన్నారు. జిల్లాలో పలు రహదారులు సైతం దెబ్బతిన్నాయని అన్నారు. కేంద్ర బృందానికి జరిగిన నష్టం చూపించి వివరాలు తెలిపి నివేదిక అందించి సాయం కోరతామని అన్నారు. కలెక్టర్‌కు గృహాల యజమానులు, రైతులు తమ కష్టాల గోడు వినిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సర్పంచ్‌లు గుంటూరు శ్రీనివాసచౌదరి, కాకర్ల వెంకటరత్నం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, ఆర్డీవో డి.రాజు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, టీడీపీ నేతలు కోయా ఆనందప్రసాద్, ఎస్.శివరామ్‌ప్రసాద్, అనంతనేని ఆజాద్, ముసునూరి శ్రీధర్, ముసునూరి నిర్మల్‌కుమార్, వీరంకి కుటుంబరావు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

కంకిపాడు: కృష్ణానది వరదతో ముంపు బారిన పడ్డ పంట పొలాలను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పరిశీలించారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం ప్రాంతాల్లో వరద కారణంగా నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం సర్వే జరుగుతున్న తీరుపై జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతితో సమీక్షించారు. సర్వే పకడ్బందీగా జరిగేలా చూడాలని, వరద ముంపుతో ఏర్పడిన నష్టం నుంచి కోలుకునేలా, పంటను సంరక్షించుకునే చర్యలపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈనెల 11న జిల్లాలో కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాలను సందర్శించి పంట నష్టం, ముంపు వివరాలతో సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సర్పంచ్ చిప్పల రామదాసు, ఏఓ పీఎం కిరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో ఆర్డీఓ రాజు, తహసీల్దార్ వి.భావన్నారాయణ వ్యవసాయాధికారులతో పర్యటించి పంట నష్టం సర్వేను తనిఖీ చేశారు.

పులిగడ్డ గురుకుల పాఠశాలలో జ్వరాల కలకలం

జ్వరాల బారిన పడిన 25 మంది విద్యార్థులు

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున జ్వరాల బారిన పడటం కలకలం రేపుతోంది. పాఠశాలలో మొత్తం 450 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 25 మంది వరకూ జ్వరాల బారిన పడ్డారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఐదుగురు విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు. సమాచారం అందిన వెంటనే వేకనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాహుల్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాల బారిన పడిన కొంతమంది విద్యార్థులకు అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి సెలైన్లు ఎక్కించారు. మిగిలిన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వర లక్షణాలు ఉన్నవారు అశ్రద్ధ చేయకుండా చికిత్స తీసుకోవాలని డాక్టర్ రాహుల్ ప్రభాకర్ సూచించారు. ఇటీవల వచ్చిన వరదలకు ఇళ్లకు వెళ్లి వచ్చిన విద్యార్థులు ఎక్కువగా జ్వరాల బారిన పడినట్టు ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులందరికీ టైఫాయిడ్, డెంగీ, మలేరియా వైద్య పరీక్షలు చేస్తున్నట్టు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ రియాజ్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శతాబ్దాల వేదన

- బెజవాడ దుఃఖదాయిని బుడమేరు
- బ్రిటిష్ కాలం నాటి నుంచీ ఎడతెగని సమస్య
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 130 కిలోమీటర్ల మేర ప్రయాణం
- సకల వాగుల సమ్మేళనమే బుడమేరు

జి.కొండూరు: బుడమేరు పేరు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ వాగు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించి జనజీవనాన్ని అతలాకుతలం చేయడంతో మరోసారి చర్చనీయాంశమైంది. దాదాపుగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి బుడమేరు వరదల చరిత్ర నాటి తరాల వారసులు నేటికీ కథలు కథలుగా చెబుతూనే ఉంటారు. నాటి నుంచి అనేకసార్లు బుడమేరుకు వరదలు వచ్చినప్పటికీ 1964, 2005లో వచ్చిన వరదలు నేటికీ పీడ కలగానే ఉంది. అయితే అప్పట్లో జనాభా ఇప్పుడున్నంత లేకపోవడం, దిగువ బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఇప్పుడున్న కట్టడాలు అప్పట్లో లేకపోవడంతో వరద ప్రవాహం అతి కొద్ది రోజుల్లోనే దిగువకు వెళ్లిపోయేది.

దుర్గం కొండల్లో పుట్టి...


ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎ.కొండూరు మండల పరిధిలో అటు నారికంపాడు, ఇటు కృష్ణారావుపాలెం గ్రామాల మధ్యన ఉన్న దుర్గం కొండల్లో జమ్ములవోలు అనే ప్రాంతంలో వేల ఏళ్ల క్రితం ప్రకృతి సహజ సిద్ధంగా బుడమేరు పుట్టింది. ఈ బుడమేరు అదే మండల పరిధి చీమలపాడు, రామచంద్రాపురం మీదుగా తిరువూరు విజయవాడ జాతీయ రహదారికి సమాంతరంగా ప్రవహించి, బాడవ గ్రామ శివారులో మైలవరం మండల పరిధిలోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి కొత్తగూడెం, పుల్లూరు వద్ద జమలాపురం రోడ్డును దాటుకుని బొర్రగూడెం నుంచి చంద్రగూడెం వద్ద జాతీయ రహదారిని దాటుతుంది. అక్కడి నుంచి మైలవరం మీదుగా జి.కొండూరు మండల పరిధిలోని చిన్న నందిగామ, కుంటముక్కల, వెల్లటూరు, హెచ్.ముత్యాలంపాడు గ్రామాల మీదుగా వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ వద్దకు చేరుకుంటుంది. ఈ వాగు పుట్టిన ప్రదేశం నుంచి వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ వరకు కోతులవాగు, పులివాగు, కొండవాగు, బీమ్‌వాగు, లోయవాగు, దొర్లింతల వాగు, కప్పలవాగు, తొమ్మండ్రం వాగులను కలుపుకొని 47 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విజయవాడ మీదుగా ఎనికేపాడు వరకు 36 కిలోమీటర్లు, అక్కడి నుంచి కొల్లేరు వరకు 47 కిలోమీటర్లు మేర ప్రవహించి కొల్లేరులో కలుస్తుంది.



వెలగలేరు వద్ద బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్

రెగ్యులేటర్ నిర్మాణం ఇలా...

బుడమేరుకు 19వ శతాబ్దంలో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకొని వరద ప్రవాహం నేరుగా విజయవాడ నగరం వైపు వెళ్లకుండా ఉండేందుకు జి.కొండూరు మండల పరిధి వెలగలేరు గ్రామ శివారులో 15వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవాహ సామర్థ్యంతో 11 అడుగుల ఎత్తుతో 11 లాకులతో హెడ్ రెగ్యులేటర్ నిర్మాణానికి అప్పటి పాలకులు రూపకల్పన చేశారు. దీనికి అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు అల్లూరి సత్యనారాయణ 1956 నవంబరు 4న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బుడమేరు వరద ప్రవాహం విజయవాడ వైపు వెళ్లకుండా 7,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో కవులూరు గ్రామ శివారులో నుంచి కొండపల్లి మీదుగా 11.90 కిలోమీటర్ల డైవర్షన్ కెనాల్ తవ్వించారు. అయితే వరద ఉధృతి పెరిగినప్పుడు హెడ్ రెగ్యులేటర్ వద్ద 30 వేల క్యూసెక్కులకు పైగా నీరు నిల్వ ఉండి పైన ఉన్న గ్రామాలు నీటి ముంపునకు గురవుతున్నాయి. ఈ క్రమంలో 1990-95 మధ్య కాలంలో డైవర్షన్ కెనాల్‌ను 15 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచారు. 2005లో బుడమేరు ఉప్పొంగి విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తడంతో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బుడమేరుపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే పోలవరం రైట్ మెయిన్ కెనాల్ నుంచి 11,255 క్యూసెక్కుల గోదావరి నీటిని సైతం వెలగలేరు గ్రామం మీదుగా హెడ్ రెగ్యులేటర్ వద్ద డైవర్షన్ కెనాల్‌లో కలపాల్సి వచ్చింది. దీనితో డైవర్షన్ కెనాల్‌ను 37,555 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనులను కూడా ప్రారంభించారు. 11.90 కిలోమీటర్లు ఉన్న ఈ డైవర్షన్ కెనాల్ సామర్థ్యం పెంపు పనులు 80 శాతంకి పైగా పూర్తయినప్పటికీ వీటీపీఎస్ అభ్యంతరాలు, ఆంధ్రజ్యోతి పత్రిక అధినేత వేమూరి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్‌ప్లాంట్ తొలగింపు ప్రక్రియలో కోర్టు జోక్యంతో నిలిచిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూడా ఈ పనులు ప్రారంభించేందుకు యాక్టివ్ పవర్ ప్లాంట్ తొలగింపునకు నోటీసులు ఇచ్చినా కోర్టు స్టే ఇవ్వడంతో పనులు మరోసారి నిలిపివేయాల్సి వచ్చింది.



కవులూరు గ్రామ శివారులో బుడమేరు డైవర్షన్ కెనాల్

ఇప్పటి వరదలకు ప్రధాన కారణం...

గత నెల 31నుంచి ప్రారంభమైన బుడమేరు వరద ప్రవాహం విజయవాడ నగరాన్ని ముంచెత్తి గడగడలాడించింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వానిదైతే రెండో కారణం మానవ తప్పిదమే. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో నీరు-చెట్టు పేరుతో రూ.వందల కోట్ల విలువ చేసే మట్టిని చెరువుల నుంచి తరలించారు. కానీ చెరువుల కట్టలను మాత్రం బలోపేతం చేయలేదు. దీనితో ప్రస్తుతం వచ్చిన వరదల కారణంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాలలోని 70 చెరువులకి పైగా గండ్లు పడి బుడమేరుకు వరద ప్రవాహం ఒక్కసారిగా వచ్చి పడింది. దీనికి తోడు బుడమేరు డైవర్షన్ కెనాల్ అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులే మోకాలడ్డు పెట్టడంతో డైవర్షన్ కెనాల్‌కి ఎడమ వైపు కట్టకు మూడు చోట్ల, కుడి వైపు ఏడు చోట్ల గండ్లు పడి ఆ వరద ప్రవాహం కూడా విజయవాడ వైపే వెళ్లింది. మొత్తంగా హెడ్ రెగ్యులేటర్ నుంచి 40 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం, డైవర్షన్ కెనాల్ గండ్ల నుంచి 30వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం ఒక్కసారిగా విజయవాడ నగరాన్ని చుట్టుముట్టింది. వాగు పూర్తిగా ఆక్రమణల పాలై, నగరం మొత్తం కట్టడాలతో నిండిపోవడంతో వరద ప్రవాహం ముందుకు సాగే అవకాశం లేక నగరాన్ని ముంచెత్తి పెను విధ్వంసాన్ని సృష్టించింది.

రిజర్వాయర్ల నిర్మాణానికి సిఫార్సు...

బుడమేరుకు 1964లో వచ్చిన వరదల కారణంగా ఈ వరదల ఉధృతిని దిగువ ప్రాంతాలపై ప్రభావం చూపకుండా ఉండేలా అప్పటి కేంద్ర ప్రభుత్వం మిత్రా కమిటీ, ఆ తర్వాత 1985-90 మధ్య కాలంలో శ్రీరామకృష్ణయ్య కమిటీలను వేసింది. ఈ కమిటీలు బుడమేరు వరద ప్రవాహ నియంత్రణకు పలు సూచనలు చేశాయి. డైవర్షన్ కెనాల్ సామర్థ్యం పెంచడంతో పాటు బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు, కాలువ వంపులను సరిచేయడం వంటి సిఫార్సులను చేసింది. హెడ్ రెగ్యులేటర్‌కు ఎగువ ప్రాంతమైన మైలవరం మండల పరిధి బాడవ, తోలుకోడు, చంద్రగూడెం, జి.కొండూరు మండల పరిధిలోని చిన్న నందిగామ, చెర్వుమాధవరం, వెల్లటూరు, వెలగలేరు వద్ద రిజర్వాయర్లను నిర్మించాలని సూచించాయి. అయితే ఆయా ప్రాంతాల్లో భూములు ఇచ్చేందుకు రైతులు అభ్యంతరాలు తెలపడంతో ఈ సిఫార్సులు మరుగున పడిపోయాయి.

క్లుప్తంగా

అడ్వాన్స్‌ను వడ్డీతో చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుడు ఇచ్చిన అడ్వాన్స్‌ను వడ్డీతో తిరిగి చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మి రాయల మంగళవారం తీర్పిచ్చారు. కోడూరుకు చెందిన కె.పోతయ్య గుంటూరుకు చెందిన శ్రీ షిర్డీ సాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ప్లాటును 2017లో రూ.22.50 లక్షలకు బుక్ చేసుకుని రూ.4.10 లక్షల అడ్వాన్స్ చెల్లించారు. 18 నెలల పాటు వాయిదా పద్ధతిలో మిగిలిన మొత్తం చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి ఆ కంపెనీ వాయిదా సొమ్ము తీసుకోకపోగా రిజిస్ట్రేషన్ చేయకపోవటంతో పోతయ్య నోటీసులు పంపారు. ఫలితం లేకపోవటంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన అనంతరం కమిషన్ సభ్యులు అగ్రిమెంట్ పిరియడ్ పూర్తయిన జూలై 2019 నుంచి 9 శాతం వడ్డీతో రూ.4.10 లక్షలు తిరిగి చెల్లించాలని తీర్పు చెప్పారు. మానసిక వేదనకు రూ.25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు కలిపి తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

ఐదేళ్ల నానో టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ నానో టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి ఆచార్య వి.రవికుమార్ తెలిపారు. మూడో విడత వెబ్ ఆప్షన్లు, రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు WWW.OAMDC.AP.GOV.IN వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ / బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94915 49853, 99661 19781 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లంక రైతులు విలవిల

- వరద ముంపు నుంచి బయటపడిన పంటపొలాలు
- నీటమునిగిన పొలాల్లో కుళ్లిపోతున్న వివిధ పంటలు

తోట్లవల్లూరు: కృష్ణానది వరదతో ముంపునకు గురైన లంకలు తేరుకుంటున్నాయి. మెరక పొలాల్లోని వరద నీరు బయటకు వెళ్లిపోగా, పలు చోట్ల పల్లపు ప్రాంతాల్లో ఇంకా నీరు నిలిచే ఉంది. వరదతో దెబ్బతిన్న పంట పొలాలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. తోట్లవల్లూరు మండలంలో కృష్ణా కరకట్ట వెంబడి రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో విస్తారంగా ఉన్న లంక భూముల్లో రైతులు వాణిజ్య పంటలైన కంద, పసుపు, అరటి, తమలపాకు, చెరకు, బొప్పాయి, కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారు.


వల్లూరుపాలెం లంకలో కుళ్లిపోతున్న పసుపు తోట

నిండా ముంచిన వరద

గతంలో ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి వచ్చిన వరదతో పంటలన్నీ రోజుల తరబడి నీటమునిగి దెబ్బతిన్నాయి. పెద ఏటిపాయ, చిన ఏటిపాయ కలిసి ప్రవహించడంతో దాదాపుగా లంకల్లో వేలాది ఎకరాల్లో సాగవుతున్న పంటలన్నీ నీటమునిగాయి. సుమారు పదకొండున్నర లక్షల క్యూసెక్కులపైగా వరద రావటంతో చెరకు మినహా మిగిలిన పంటలన్నీ వరద పాలయ్యాయి.

రైతుల పరిస్థితి దయనీయం

పంటలన్నీ ముంపునకు గురి కావటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ముంపు నుంచి బయటపడిన పంటలు కుళ్లిపోవడంతో వారికి కన్నీరే మిగిలింది. చిన్న చిన్న రైతులు కూడా అప్పోసప్పో చేసి వేలాది రూపాయలు వెచ్చించి పసుపు, కంద వంటి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పంటలన్నీ దెబ్బతినడంతో ఒక్క రూపాయి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. నీటి ముంపునకు గురై దెబ్బతిన్న పొలాలను చూడటానికి కూడా పలువురు రైతులు సాహసం చేయలేకపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

వరదతో దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయంపై మక్కువతో లక్షల రూపాయలు వెచ్చించి పంటలు సాగు చేశామని, వరద ఇలా ముంచేస్తుందని అనుకోలేదని ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పంటల బీమా అమలు చేసి కాపాడారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అలాగే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వల్లూరుపాలెం లంకలో దెబ్బతిన్న అరటి పైరు


పాములలంకలో కుళ్లిపోతున్న కంద పంట

రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం కావాలి

- ఘాట్‌రోడ్డులో పనులను పరిశీలించిన మంత్రి ఆనం
- దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చ
- మరో రెండు రోజుల్లో పనులపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డులో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను మంగళవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. తొలుత ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న కొండ చరియలు విరిగి పడ్డాయి. దీంతో రిటైనింగ్ వాల్‌ను పునర్నిర్మిస్తుండగా, పనులను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఓం టర్నింగ్ వద్ద జరుగుతున్న రాక్ ఫాల్ మీటిగేషన్ పనులు, ఆలయ ప్రాంగణంలోని సమాచార కేంద్రం వద్ద విరిగిపడిన కొండ చరియలను మంత్రి పరిశీలించి ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. దసరా ఉత్సవాల నాటికి ఇంజినీరింగ్ పనులు పూర్తి కావాలని, కొండ చరియలు ఉన్న ప్రాంతంలో తగినన్ని జాగ్రత్తలు పాటించి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

రెండు రోజుల్లో తొలి సమీక్ష సమావేశం

అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఆలయ అధికారులతో శాఖాపరమైన సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దుర్గగుడి అధికారులకు సూచించారు. ఉత్సవాల నేపథ్యంలో క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, పూజలు వంటి అంశాలను ఆలయ ఈఓ రామరావు మంత్రికి వివరించారు. ఆలయానికి, దసరా ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలు, గతంలో ఉత్సవాల సందర్భంగా ఎదురైన లోటుపాట్ల వివరాలను సమావేశానికి ముందుగానే తనకు అందచేయాలని మంత్రి ఆదేశించారు. దుర్గగుడి మాస్టర్ ప్లాన్లు, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అంతకు ముందు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేయగా, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ జి.వి.శేఖర్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సివిల్ డిపార్ట్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఆలయ ఈఈలు కె.వి.ఎస్.కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాస్టర్ ప్లాన్, ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం తదితరులు

కేంద్ర బృందం పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

గుడివాడరూరల్: వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన పంట పొలాలను, గ్రామాలను కేంద్ర బృందం బుధవారం పరిశీలించనుందని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. ఈ ఈ మేరకు ఏర్పాట్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. నందివాడ మండలం పుట్టగుంట గ్రామం వద్ద అధికారులతో కలసి మంగళవారం రాత్రి బస్సులో ప్రయాణించి బుడమేరును పరిశీలించారు. టీడీపీ నాయకులు యథేచ్ఛగా రొయ్యలు, చేపల చెరువుల తవ్వకాల వల్ల డ్రెయిన్లు సరిగా లేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, దోసపాడు చానల్ గుర్రపుడెక్క, తూడుతో పూడుకుపోయిందని ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్ వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని రైతులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని గన్నవరం, పెనమలూరు, కంకిపాడు, నందివాడ మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో వరద ముంపును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.పద్మావతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి, గుడివాడ మునిసిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన రైల్వే జీఎం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లో వరద ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలసి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం పర్యటించారు. ముఖ్యంగా కృష్ణానదిపైన రైల్వే బ్రిడ్జి, రాయనపాడు స్టేషన్, విజయవాడ – తేలప్రోలు సెక్షన్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కృష్ణానది రైల్వే బ్రిడ్జిని తనిఖీ చేసి భద్రతా చర్యలపై ఆరాతీశారు. కొత్తగా ఆవిష్కరించిన గిడ్డర్ బ్రిడ్జిల స్లీపర్‌ల క్లిప్ టూల్ తుప్పు పట్టకుండా ఉండేలా ఏర్పాటు చేసిన యాంటీ క్రిప్ పరికరం పనితీరును పరిశీలించారు. అక్కడ నుంచి రాయనపాడు స్టేషన్ చేరుకుని తనిఖీలు చేపట్టారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని తీవ్ర వర్షపాతం, తుపాను సమయంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాయనపాడు స్టేషన్‌లో వరద ముంపులో చిక్కుకున్న ప్రయాణికులను అతి తక్కువ సమయంలోనే ప్రత్యామ్నాయ మార్గాల్లో వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చిన అధికారులు, సిబ్బందిని జీఎం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజయవాడ – తేలప్రోలు సెక్షన్‌ను విండో తనిఖీ చేశారు. గన్నవరంలో ఆధునికీకరించిన బ్యాలస్ట్ క్లీనింగ్ మెషిన్ పనితీరును పరిశీలించారు. అనంతరం విజయవాడ–ఖాజీపేట మధ్య మూడో లైన్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.


కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

కొండచరియలు విరిగిపడి ఒకరు దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- చెట్లు నరుకుతుండగా ఘటన

గుణదల (విజయవాడ తూర్పు): కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన విజయవాడలోని మాచవరం కొండ ప్రాంతంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఎదురుగా డేరంగుల వెంకటస్వామి వీధిలో నివసించే గూడె గోపీకుమార్ తన ఇంటి వద్ద పెరిగిన చెట్లను తొలగించేందుకు ఇజ్జాడ రాము (58), బసూరి కామయ్య, కళ్ల రాజు, ఎస్‌కే హుస్సేన్‌ను కూలికి మాట్లాడుకున్నాడు. వారు కొండ అంచున చెట్లు నరకడానికి ప్రయత్నించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాని ఉన్న కొండ రాళ్లు ఒక్కసారిగా విరిగి వారి మీద పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇజ్జాడ రాము అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బసూరి కామయ్య, కాళ్ల రాజు, ఎస్‌కే హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బెత్లెహామ్ నగర్‌కు చెందిన ఇజ్జాడ రాముకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూలి కోసం వెళ్తే ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.


విరిగి పడిన కొండ చరియలు


గాయపడిన క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న స్థానికులు

ముంపు పొలాల్లో సస్యరక్షణ చర్యలు కీలకం

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



కంకిపాడు: భారీ వర్షాలు, వరద ముంపుతో పంట పొలాలు నీట మునిగాయి. రోజులు తరబడి పొలాల్లో నీరు నిలిచిపోయింది. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే పంటకు నష్టం వాటిల్లుతుంది. పంట సంరక్షణ చర్యలతో నష్టాన్ని అధిగమించొచ్చని సూచిస్తున్నారు ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి. వరి, చెరకు పైర్లలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలను ఆమె 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

- కృష్ణా జిల్లాలో వర్షాలు, వరదలతో వరి, చెరకు పైర్లు ముంపు బారిన ఉన్నాయి. తెగుళ్ల వ్యాప్తికి ఆస్కారం ఎక్కువగా ఉంది. పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉండాలంటే సస్యరక్షణ చర్యలు చాలా ముఖ్యం. తద్వారా నష్టాన్ని అధిగమించొచ్చు. సాగు లాభదాయకంగా మార్చుకోవటానికి యాజమాన్య చర్యలు తప్పక తీసుకోవాలి.
- జిల్లాలో ప్రధానంగా వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం వరి పిలకలు వేసే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉంది. సాధారణంగా వరి రకాలు నాలుగైదు రోజుల వరకూ నీటిలో మునిగినా బతికే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో వరి పంటలో అధిక నీటిని బయటకు పంపాలి. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, అదనంగా 20 కిలోలు పొటాష్ తప్పనిసరిగా చల్లుకోవాలి. కాంప్లెక్సు ఎరువులను ఈ దశలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.


వరి క్షేత్రం వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

- ఈ పరిస్థితుల్లో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులును గుర్తించిన వెంటనే పొలాల్లో నీటిని రెండుమూడు సార్లు తీసివేయాలి. కొత్త నీరు పెట్టుకోవాలి. పొటాష్ ఎరువును ఎకరానికి 20 కిలోలు చొప్పున వేసుకోవాలి. తద్వారా మొక్కకు వ్యాధినిరోధక శక్తి పెరిగి తెగులు ఉధృతిని నియంత్రిచుకోవచ్చు.
- పాము పొడ తెగులు ఆశిస్తే ప్రొపికొనజోల్ మిల్లీ లీటర్లు లేదా హెక్సకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆకు ముడత పురుగు కూడా ఆశించే అవకాశం ఉంది. పురుగుఉధృతి మధ్యస్తంగా ఉంటే ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా కార్టప్ హైడ్రోక్లోరైట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉంటే క్లోరాంట్రానిలిప్రోల్ మూడు మిల్లీలీటర్లు లేదా ఫ్లూబెండమైడ్ 0.4 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- నీట మునిగిన చెరకు పైరులో పోషకాలు లోపిస్తాయి. అధిక నీటిని తీసివేయాలి. ఎకరాకు 25 కిలోలు యూరియాతో పాటుగా 25 కిలోలు పొటాష్ వేసుకోవాలి. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టడానికి మురుగునీటిని బయటకు పంపి కొత్త నీటిని రెండు మూడు సార్లు పెట్టుకోవాలి.

హుస్సేన్‌పాలెంలో విషాదఛాయలు

శోకసంద్రంలో మునిగిన ఫణికృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులు

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని హుస్సేన్‌పాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గన్నవరం నుంచి కంకిపాడుకు వెళ్లే ప్రధాన రహదారిలో కేసరపల్లి వద్ద బుడమేరు వాగులో కారుతో పాటు కలిదిండి ఫణికృష్ణ శనివారం రాత్రి కొట్టుకుపోయారు. ఆయన మృతదేహాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కనుగొన్నాయి. మంగళవారం ఉదయం గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఫణికృష్ణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనంతరం ఆ మృతదేహాన్ని హుస్సేన్‌పాలెం తీసుకొచ్చారు. ఫణికృష్ణ తండ్రి సుబ్బారావు, తల్లి శివలీలతో పాటు భార్య జ్యోతి, కుమార్తెలు పూజిత, యామిని, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామస్తులు ఫణికృష్ణ మృతదేహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.


ఫణికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

రైళ్లలో చోరీలకు పాల్పడ్డ నిందితుడి అరెస్టు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగుల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఉదయం పది గంటల సమయంలో పదో నంబర్ ప్లాట్‌ఫామ్ ఉత్తరం వైపు గుంటూరు జిల్లా, వెనిజెండ్ల గ్రామానికి చెందిన మూల్పూరి ఫణీందర్‌రెడ్డి అనుమానాస్పదంగా ఉండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగును సోదా చేయగా ల్యాప్‌టాప్, ఐఫోన్, సాంసంగ్ ట్యాబ్ కనిపించాయి. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు. వాటిని ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లు ఫణీందర్‌రెడ్డి ఒప్పుకున్నాడు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.


నిందితుడు, చోరీ సొత్తుతో జీఆర్‌పీ పోలీసులు

పోరంకిలో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: మండలంలోని పోరంకిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ కథనం మేరకు.. మొవ్వకు చెందిన పులి శివరామకృష్ణ(36), స్వాతి దంపతులు పోరంకి నారాయణపురం కాలనీలో ఒకరి వద్ద పని చేయటానికి మూడేళ్ల క్రితం వచ్చారు. వారు కాలనీలోనే సర్వెంట్ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. శివరామకృష్ణకు మద్యం తాగే అలవాటు ఉంది. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివరామకృష్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని భార్య స్వాతి గుర్తించి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శివరామకృష్ణ మంగళవారం మృతి చెందాడు. తన భర్త ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో తెలియదని స్వాతి పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


శివరామకృష్ణ మృతదేహం

హత్య కేసులో నిందితుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్ రూరల్: భర్త వేధింపులు తట్టుకోలేక అతడిని కడతేర్చిన భార్యను, ఆమెకు సహకరించిన తల్లిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామానికి చెందిన కన్నిగంటి రామభూషణం (53)ను భార్య నాగశిరోమణి తన తల్లి ఆవిర్నేని ఝాన్సీలక్ష్మితో కలిసి హత్య చేసిన విషయం విదితమే. ఈ నెల ఆరో తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పథకం ప్రకారం ఇంట్లో గాఢనిద్రలో ఉన్న రామభూషణం తలపై శిరోమణి, ఝాన్సీలక్ష్మి కర్రతో బలంగా కొట్టి హత్య చేశారు. ఈ ఘటనపై మృతుడి సోదరి పెండ్యాల పూర్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీఐ కె.వి.వి.ఎన్.సత్యనారాయణ నిందితులు నాగశిరోమణి, ఝాన్సీలక్ష్మిని మంగళవారం అరెస్ట్ చేసి నూజివీడు కోర్టులో హాజరుపర్చారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్)/జగ్గయ్యపేట: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందారు. విజయవాడ 64వ డివిజన్ కండ్రికకు చెందిన పిన్నిశెట్టి నాగేంద్రబాబు(24) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. వరద బాధితులకు పంపిణీచేస్తున్న భోజనం ప్యాకెట్ల కోసం వెళ్లిన నాగేంద్రబాబు సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఆనుకున్నాడు. అంతలోనే విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. అతడికి కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బందితో సీపీఆర్ చేయించి మెరుగైన వైద్యకోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నాగేంద్రబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నున్న పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది.

బూదవాడలో..

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన జగ్గయ్యపేట మండలం బూదవాడలో మంగళవారం జరిగింది. బూదవాడ గ్రామాన్ని ఈటీవల వరద ముంచెత్తింది. లావుడియా నాగేశ్వరరావు (53) ఇంటిలోకి కూడా వరద నీరు చేరింది. వరద తగ్గడంతో మంగళవారం ఉదయం సమయంలో నాగేశ్వరరావు ఇంటిని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వరరావు భార్య పెంతిలి ఫిర్యాదు మేరకు చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


లావుడియా నాగేశ్వరరావు (ఫైల్)